
# ఆ ఒక్కటీ అడక్కు

యండమూరి వీరేంద్రనాథ్



రాత్రి ఎనిమిదయింది.

దూరంగా కొండమీద మంచు కురవటం మసగ్గా కనబడ్తూంది. వచ్చిన దారి పాములా చీకట్లో కలిసిపోతూంది. చలి వణికిస్తూంది.

సిమ్లా మత్తుగా నిద్రపోవటానికి ఉపక్రమించబోతూంది.

కారుని ఆక్‌లాండ్ స్కూల్ పక్కన ఆపేడు రావు హాండ్ బ్రేక్ లాగి, కిందికి దిగి, చక్రంకింద రాయి పెట్టాడు. జారి పోతే కింద కొండల్లోకే.

"కూలీ సాబ్."

రావు తలూపి, వెనగ్గావెళ్ళి డిక్కీ తెరిచి రెండుసూటుకేసులూ వాడికిచ్చేడు.

సుమిత్ర కారు ముందుసీట్లో కూర్చొని అంతా చూస్తూంది. ఆమె కోపంగా వుందని అతడికి తెలియాలని ఆమె తాపత్రయపడ్తోందని అతడికి తెలుసునని ఆమెకి తెలుసు. అయినా బింకంగానే వుంది. బింకం ఏమిటి – నిజంగానే ఒళ్ళు మండిపోతూంది ఆమెకి. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అది జరిగినప్పట్నుంచీ ఈ గొడవ ప్రారంభమయింది. ఆ ఊళ్ళో వున్న రెండ్రోజులు రావుకి ఉపవాసమే.

రావు కిటికీలోంచి చూసి, "దిగు" అన్నాడు. "కారు ఇక ఊళ్ళోకి వెళ్ళదు. ఇక్కడ్నుంచి నడిచే వెళ్ళాలి."

ఆమె దిగి, కారు డోరు అతడి మొహంమీద చప్పుడయ్యేలా ధడేలున వేసింది. అదిరిపడి దాన్ని పైకి కనిపించకుండా షాల్ ఆమె భుజాలమీద సర్దుతూ "బాగా చలిగావుంది కదూ" అన్నాడు. ఆమె అతడి చెయ్యి విదిలించి ముందుకు నడిచింది కూలీ వెనగ్గా.

రావు ఆగి, జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకొని ఓ క్షణం అలానే నిలబడ్డాడు....లాభంలేదు....ఈ సిమ్లా ట్రిప్పు చాలా బేవార్సుగా ముగియబోతూంది.

అతడు తలెత్తి చూసేడు. ఆకాశం కొద్దిగా మేఘావృతమై వుంది. ఓ కొండ అంచుల్లో ఇళ్ళపైన కప్పుల మీద మంచు తెల్లటి కుచ్చుటోపీలా వుంది. నల్లటి చెట్లమీద తెలుపు, గుర్తు తెలియని చిత్రకారుడి అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌లా వుంది. దూరంగా కొండ వంపులో ఓ ఇరవైఏళ్ళ కుర్రోడూ, పద్దెనిమిదేళ్ళ అమ్మాయీ చాలా దగ్గరగా ఒకళ్ళ చేతుల్లో ఒకళ్ళు పాల్ అండ్ మిచ్చల్‌లా నడిచి వెళ్తున్నారు.

రావ్‌కి తనమీద తనకే జాలేసింది. తొందరగా సుమిత్రని మంచిచేసుకోపోతే రెండువేలూ గంగలో పోసినట్టే.

ముందు కూలీ సునాయాసంగా పైకి ఎక్కుతున్నాడు. సుమిత్ర వెనుకే నడుస్తూంది. ఆమె పచ్చటి షాల్ – ఎర్రటి చీరపైన, నల్లటి చీకట్లో తెల్లటి మంచు బాక్‌గ్రౌండ్‌లో అందంగా వుంది. పన్నటి నడుముమీదనుంచి క్రిందికి జారిన చీరె హిమాలయాల్లో మందాకిని. బలమైన కోర్కె మనసులో సముద్ర కెరటం.

హోటల్ బ్రైట్ రిసెప్షన్ క్లర్కు నిద్రలోకి జోగుతున్నాడు. అలికిడికి కళ్ళు తెరిచేడు.

"మిసెస్ అండ్ మిష్టర్ రావ్. రిజర్వేషన్."





క్లర్క్ ఒకసారి తలెత్తి ఇద్దరి వైపూ చూసి, రిజిష్టర్ తీసి చూసి, పెన్‌తో వ్రాసేడు. రావు సంతకం పెట్టి, కారిడార్‌లో నడిచేడు. బోయ్ రూమ్ తెరిచేడు.

డబుల్‌రూమ్–ఒకమూల ఫ్లవర్‌వేజ్. బల్లమీద ఫోన్. రెండు పక్కలు – గార్డెన్‌ఛైర్. స్క్రిబ్లింగ్ పాడ్‌తో సహా.

అతడు సంతృప్తిగా తల పంకించాడు. సుమిత్ర సూట్‌కేస్‌లోంచి చీరె తీసుకొని బాత్‌రూంలోకి వెళ్ళింది. అతడికి మాత్రం నూటఅరవై మైళ్ళు డ్రైవ్ చేసినా అలసటగా లేదు. ఫ్రెష్ యాజ్ రోజెస్. సుమిత్ర ఉడుక్కోవటానికి వున్న శతకోటి కారణాల్లో అదొకటి. ఆమె పక్కన అతడు తమ్ముడిలా వుంటాడు.

అతడు బూట్లు విప్పి మంచంక్రిందికి తోసి, కిటికీ తలుపు తెరిచేడు ఒక్క క్షణం ఏదో అపురూపమైన దృశ్యాన్ని చూస్తున్నట్టు అలానే వుండిపోయాడు. ఎత్తయిన కొండ ఛాయలో మెలికలు చుట్టుకొని నిద్రపోతున్న కొండచిలువలా వుంది సిమ్లా. భూమిలో బాణాలు పాతినట్లు చెట్లు.

తలుపు చప్పుడయింది. బాత్‌రూంలోంచి సుమిత్ర వచ్చింది. వెనగ్గా వచ్చి భుజంమీద తల ఆన్చి, కిటికీలోంచి బయటకి చూడటం అందమైన అనుభూతి. అతడు ఊపిరి బిగపట్టేడు. ఉహూ. ఆమె అడుగుల చప్పుడు దగ్గిరవలేదు. పక్క మీద వాలి ఫిల్మ్‌ఫేర్ తీసి చదవటం ప్రారంభించింది. అతడు కనుకొలుకుల్లోంచి ఆమెని చూసేడు. మంచుకప్పిన పర్వతంలా మోకాలిమీదనుంచి క్రిందికి జారిన షిఫాన్ చీరె. కేవలం తనని కవ్వించటంకోసమే.

అతడు దగ్గిరగా వెళ్ళి మీద చెయ్యి వేసి "సుమిత్రా" అన్నాడు. చెయ్యి విదిలించి కొట్టింది. అతడికి నవ్వొచ్చింది.

"ఎందుకింత పంతం చెప్పు."

"మీకు మాత్రం ఎందుకంత పంతం?"

"నాకేమీ పంతం లేదు."

"అయితే మరెందుకు చెప్పకూడదు?"

ఆ చెప్పదల్చుకొన్నది తల్చుకుంటేనే పొరలు పొరలుగా నవ్వొస్తూంది అతడికి. అతడు నవ్వటం చూసి, ఆమె మరింత ఉక్రోషపడి "అదిగో – అదే ఒళ్ళు మండుతూంది," అన్నది. అతడు నవ్వటం మానేసి"సర్లే నవ్వన్లే" అన్నాడు.

"అయితే చెప్పండి. మోచేతిమీద" లేచి ఆత్రంగా కూర్చుంది.

"ఏం చెప్పను?"

"అదే. ఎయిర్ పోర్టులో ఆ అమ్మాయి మీతో ఏమిటన్నది?"

"ఏమీలేదు."

ఆమె విసురుగా వాళ్ళోంచి తలగడ విసిరికొట్టి మంచంమీదనుంచి లేచి కిటికీ దగ్గిరకి వెళ్ళి నుంచుని బయటకు చూసింది.

రావుకి ఆమె కోపం చూసి నవ్వొస్తూంది ఒకవైపు. ఎందుకు చెప్పాలి అని పంతం ఇంకోవైపు.

అసలా ఎయిర్ పోర్టు అమ్మాయెవరో తన ప్రాణం తీయటానికే తనని పిల్చినట్టుంది.

ఢిల్లీలో దిగేసరికి సాయంత్రం అయిదయింది. ఎయిర్ బస్ చాలా రష్గా వుంది. రావూ, సుమిత్రా బ్యాగేజికోసం నిలబడ్డారు . అప్పుడొచ్చింది ప్రళయం.

సుమిత్ర మాటిమాటికి రావువైపు చూస్తూంది. గ్రే సూట్లో అతడు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాడు. అందమైన మగవాడు. చూడటానికి బావుంటాడు కానీ వాడే మొగుడైతే ప్రతిక్షణమూ వాణ్ణి పరిరక్షించుకోవటానికే టైమ్ సరిపోతుందని సుమిత్ర తన పద్నాలుగేళ్ళ వైవాహిక జీవితంలో అనుభవపూర్వకంగా గ్రహించింది. అందులో ఆ రోజు ఆ సూట్లో అతడు మరీ బావున్నాడు, స్తంభానికి అనుకొని నిలబడి సిగరెట్ వెలిగించుకొంటూంటే చూడముచ్చటగా. అయితే సుమిత్ర అతణ్ణి చూడటంలేదు. అక్కడికి పది గజాల దూరంలో ఓ చిన్నది చేతిలో పేరుకి ఓ పుస్తకం పట్టుకొని, దానిపై నుంచి రావ్ని ఓరగా చూస్తుందని గమనించింది.

రావ్కి ఆ అమ్మాయి తనని చూస్తూందని తెలుసు. తనని ఆ అమ్మాయి చూడటం భార్య చూస్తూందని కూడా తెలుసు. అందుకే అవసరమైన దానికంటే ఎక్కువ కాన్సన్ట్రేషన్తో వస్తూన్న బ్యాగేజివైపు చూడసాగేడు.

ఆ అమ్మాయి తన మొగుడివైపు అలా చూడటం సుమిత్ర కన్నులు నచ్చలేదు. కొర కొరా చూసింది. అయినా లాభంలేకపోయింది.

అయిదు నిమిషాల్లో బ్యాగేజీ వచ్చేసింది.

అవి తీసుకొని బైటకొస్తూంటే జరిగిందది. స్ప్లిట్ సెకెండ్లో....రావు సుమిత్ర వెనుగ్గా నడుస్తుంటే ఆ అమ్మాయి చేత్తో దగ్గిరకు రమ్మన్నట్టు సైగచెయ్యటం, రావ్ తననేనా అన్నట్టు చూడటం, ఆ అమ్మాయి తలూపటం అతడు ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళటం సుమిత్రచూస్తూండగానే జరిగిపోయేయి. ఆ అమ్మాయి నవ్వుతూ ఏదో అనటం– రావు మొహం ఎర్రబడటం – అతడూ నవ్వటం, ఏదో అని వెనక్కి తిరగటం కన్ను మూసి తెరిచేంతలో జరిగిపోయేయి. భార్య దగ్గిరకొచ్చి 'పద' అన్నాడు.

కారు ఇంద్రప్రస్థ మార్గ్వైపు పోతూ వుండగా సుమిత్ర కంఠాన్ని చాలా క్యాజువల్గా పెట్టి "ఏమిటి ఆ అమ్మాయి అంటున్నదీ?" అంది. రావు అంతకన్నా మామూలుగా "ఏమీ లేదు" అని అన్నాడు.

"చెప్పకూడదా ఏమిటి?"

"ఏం లేదన్నాగా –"

కారు హోటల్ముందు ఆగటంతో ఆ టాపిక్ ఆగిపోయింది. అయితే ఆ రాత్రి మళ్ళీ వచ్చింది.

"ఆ అమ్మాయి మీకు ఇంతకు ముందే తెలుసా?"

"ఏ అమ్మాయి?"

"అదే ఎయిర్ పోర్ట్ అమ్మాయి–"

"తెలీదే–"

"మరేం మాట్లాడింది?"

రావ్కి అది తల్చుకొంటే నవ్వొచ్చింది. "ఏం లేదు" అన్నాడు. మళ్ళీ నవ్వొచ్చింది. సుమిత్ర వుక్రోషంతో "చెప్పకూడ దేమిటి పెద్ద...." అన్నది.

"ఏం లేదంటున్నాగా"

సుమిత్ర అతడివైపు చిత్రంగా చూసి "ముక్కూ మొహం తెలియని పిల్ల దగ్గిరకి పిల్చి ఏమీ మాట్లాడకుండా వూరికే'హలో హౌడూయుడూ'అన్నదా"

"నేనబద్ధం చెప్పనన్న విషయం నీకు తెలుసు."

ఆ విషయం మాత్రం నిజం. రావ్ అబద్ధం చెప్పడు. పెళ్ళవగానే తన పూర్వ పరిచయాల గురించిన వివరాలన్నీ చెప్పేడు. సుమిత్రకి నచ్చిన గుణాల్లో అదొకటి.

"మీ రబద్ధం చెప్పరు. ఆ అమ్మాయి మీకు ఇంతకుముందు తెలీదు. ఆ విషయం ఒప్పుకొంటున్నాను. మరి ఆ అమ్మాయి మీతో ఏం అన్నది? 'ఢిల్లీలో ఫలానా చోటు వుంటున్నాను. సాయంత్రం రండి—' అన్నది కదూ."

"కాదు."

"పోనీ – హోటల్ దగ్గిర వెయిట్ చేస్తూ వుంటాను అన్నదా?"

రావ్ నవ్వి "కాదు," అన్నాడు.

"మరేమన్నది? లిఫ్ట్ ఇమ్మన్నదా– చెక్ఇన్ ఎక్కడో అడిగిందా? ఫ్లైట్ ఎంత ఆలస్యమో అడిగిందా–"

"అవేమీ కావు."

"మరి"

రావ్ చెప్పబోయేడు. అంతలో



పొరలు తెరలుగా నవ్వొచ్చింది. ఆ విషయం తల్చుకుంటేనే చాలు.

సుమిత్ర అతడివైపు ఉక్రోషంతో చూసింది.

"అంత మీలో మీరే నవ్వుకొనే విషయం ఏముందో. ఐ లవ్యూ అందా? అసలా అమ్మాయి చాలాసేపట్నించి మీ వైపు అదోలా చూస్తూంటేనే నాకని పించింది ఇదేదో వ్యవహారం అని."

"ఏమోమరి-నాకైతే ఆ అమ్మాయి సభ్యతా సంస్కారమూ వున్నదాన్లాగే కనిపించింది."

"పోనీ సభ్యత ఉన్నదే అనుకోండి. సభ్యతగా ఏం అడిగింది?" అన్నది 'సభ్యత' అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

అతడు కళ్ళు మూసుకొని తల వెనక్కి వాల్చేడు. సుమిత్ర అతణ్నే చూడసాగింది. అతడి బుగ్గల్లో సన్నటి మెరుపు. ఆమె వళ్ళు మండిపోతూంది. ఆ అమ్మాయి గురించి తల్చుకొంటూన్నట్టుంది అతడు. ఏదో అన్నది లేకపోతే అంత కులుకెందుకు?

ఆమె ఆలోచనల్లో వుండగానే అతడు కళ్ళు తెరిచి ఆమెవేపు చూసి నవ్వి, "పోనీ ఇక ఆ విషయం మర్చిపోకూడదా," అన్నాడు.

"ఎందుకా పంతం? చెప్పకూడదా?"

పంతం అనేసరికి అతనికి నిజంగా పంతం వచ్చింది. "ఎందుకు చెప్పాలి?" అన్నాడు.

"చెప్పరా?"

"చెప్పను—"

* * *

ఢిల్లీలో రెండ్రోజులైంది అది జరిగి. నరకం మొదలై, ఆ నరకం సిమ్లావరకూ పాకింది. అతడు ఆమెని ఎన్ని విధాల మంచిచేసుకుందామన్నా లాభం లేకపోయింది.

రాత్రి పదయింది.

రావు నిద్రపోతున్నాడు.

సుమిత్రకి బాధగానే వుంది. అయినా తన బింకాన్ని వదిలిపెట్ట దల్చుకోలేదు. ఎందుకుండాలి ఆయనకా పంతం?


ఆమెకు అతడి డైరీ జ్ఞాపకంవచ్చింది. ప్రతి విషయాన్నీ అతడందులో వ్రాస్తాడు.

ఆమె మోచేతిమీద వంగి పక్కకి చూసింది. రావ్ నిద్రలో వున్నాడు. లేచి, పెట్టె తెరిచింది. చేతులు చలికో, భయంచేతో వణుకుతున్నాయి. బట్టల మధ్య డైరీని తీసింది. బెడ్ లైట్ వెల్తుర్లో, వణుకుతున్న చేతుల్తో, తాము ఢిల్లీ వచ్చిన రోజు పేజీ తీసింది. రావు హాండ్ రైటింగ్‌లో ఇలా వుంది ఇంగ్లీషులో.

ఈ రోజే హైద్రాబాద్ నుండి ఢిల్లీ వచ్చేము. రేపు సిమ్లా ప్రయాణం. ఫ్లైట్‌లో ముఖర్జీ కలిసేడు. ఫ్లైట్ అంటే జ్ఞాపకం వచ్చింది. ఎయిర్‌పోర్టు సంగతి. ఎయిర్‌పోర్టులో....

రావ్ పక్కమీద ఇట్నుంచి అటు కదలటంతో చప్పున పుస్తకాన్ని వళ్ళో దాచుకొని, అటు చూసింది బెదురుగా. అతడు నిద్రపోతున్నాడు. ఆమె లేచి బాత్‌రూమ్ లోకివెళ్ళి బోల్టు బిగించి చదవసాగింది.

"ఎయిర్ పోర్టులో అమ్మాయి పిల్చింది. ఎవరో తెలీదు కానీ, ఎంత దంగా వుందీ - అప్పుడు చూడాలి సుమిత్ర మొహం. చాలా రోజులపాటు జ్ఞాపకం వుండిపోయే అనుభవం. ఆ అమ్మాయి నవ్వుతూ అన్న మాటలు - ఉహూ - అవి డైరీలో వ్రాసుకోవటం అనవసరం. మనసులో ఎలాగూ జ్ఞాపకం




వుండిపోతాయిగా." డైరీలో అంతే వుంది. సుమిత్ర హతాశురాలైంది. కేవలం తనకి తెలియకుండా వుండటం కోసమే వ్రాయనట్టుంది.

విసురుగా వచ్చి పక్కమీద పడుకొంది. చాలాసేపు నిద్రపట్టలేదు. ఎముకలు కొరికేసే చలి. అతడి రజాయిలో చేరదామా అనుకొంది కానీ మళ్ళీ పంతం వచ్చి అలాగే నిద్రపోయింది.

ప్రొద్దున్నే ఎనిమిదింటికి అతడు తయారయ్యేడు. "ఈ రోజు జాకూ హిల్‌కి వెళ్దాం."

"నేను రాను."

"ఏం?"

"మీకు చెప్పాలా ఏం? అన్నీ మీరు నాకు చెప్పటం లేదుగా"

ఈ సారి రావు నవ్వలేదు. "సిల్లీగా మాట్లాడక" అన్నాడు. "ఆ ఎయిర్‌పోర్టు అమ్మాయి గురించేగా నువ్వు అంటున్నది?"

సుమిత్ర మాట్లాడలేదు.

"చూడూ - అది చాలా చిన్న విషయం. నీకు ముందు చెబ్దామనుకొన్నాను కానీ ఇప్పుడే నిర్ణయించుకొన్నాను చెప్పకూడదని. నా సంగతి నీకు తెల్సుగా. ఇక అరు మూడైనా నీకు చెప్పను." అని అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు. సుమిత్ర నిస్పృహయంగా అక్కడ నిడబడలేకపోయింది రోషంతో ఆమె కళ్ళవెంట నీళ్ళొచ్చినయ్. హాండ్ బ్యాగ్ విసురుగా పక్కమీదకు కొట్టి కుర్చీలో కూలబడింది.

కానీ మధ్యాహ్నం రావ్ తిరిగొచ్చినప్పుడు అతని మూడ్ వేరు. అతడికి పీతల రేసులో ఐదొందలొచ్చింది. ఆ హుషార్‌లో వున్నాడు. రాగానే ఆ విషయం చెప్పేడు. "నిజమా డియర్" అన్నది సుమిత్ర అతడి మెడచుట్టూ చేతులువేస్తూ. రావ్ ఆమెని ముద్దు పెట్టుకొని, "పద, వియ్‌విల్ సెలబ్రేట్" అన్నాడు.

ఇద్దరూ సాయంత్రం వరకూ మాల్ అంతా తిరిగేరు.

రాత్రి డిన్నర్ అద్భుతంగా వుంది. చలి ఇంకా బాగుంది. రాత్రి పది గంటల ముప్పైరెండు నిముషాలకి దానికి న్యాయం చేకూర్చటానికి అతనామె భుజాల మీద చెయ్యి వేసేడు, ఆమె అతడి హృదయం మీద తల వాల్చింది. రెండు రోజుల దూరం అతణ్ణి తొందర పెడ్తోంది. చప్పున ఆమెని పక్కమీదకి పెల్లకిలా తోసేడు. మెడవంపులో నయాగరా - కొండల మధ్య చీకటి - సముద్రం అలలాంటి కడుపు -

"డియర్ -"

"ఊఁ...."

"ఆ ఎయిర్‌పోర్టు అమ్మాయి నీతో ఏమన్నది?"

రావ్ కదల్లేదు. అలానే క్షణం వుండి నెమ్మదిగా అన్నాడు— "నువ్వు అడుగుతావని తెలుసు. కానీ డియర్- నువ్వెంత క్లైమాక్స్‌కి నన్ను తీసుకెళ్ళి అక్కడి ఆపు చేసి అడిగినా చెప్పను. సారీ."

అప్పుడామె తోసిన తోపుకి - అతను గాలిలో రెండంగులాలు పైకి ఎగిరి, మూడు సెకన్లు గాలిలో వుండి - నాల్గడుగుల ఇవతలగా పడ్డాడు. ఎవరన్నారు స్త్రీ అబల అని.

* * *

రావ్‌కి ప్రపంచంలో తను తప్ప అందరూ ఆనందంగా వున్నట్లు కనిపిస్తున్నారు. ఆ ఎయిర్‌పోర్టు అమ్మాయి కనపడనేల? కనపడెనుపో - తనతో మాట్లాడనేల - మాట్లాడెనుపో - దాని విషయమై తన భార్యకి అంత కుతూహలమేల -

మళ్ళీ అతడికి నవ్వొచ్చింది. సిగ్గుతో కూడిన అందమైన భావం. చిన్న చిన్న అనుభవాలే అందమైన అనుభూతులుగా మిగుల్తాయి. ఆ అనుభవాల్లో డెప్త్ వుండదు. కానీ చక్కటి అనుభూతినిస్తాయి అలాటివది. పంచుకొంటే ఆనందం వుండదు. తనకి చక్కటి అనుభవం అవతలివ్యక్తికి పేలవంగానూ అర్థరహితంగానూ కనపడొచ్చు.

"మనం వెళ్ళిపోదాం." హఠాత్తుగా సుమిత్ర అనేసరికి ఉలిక్కిపడి అయోమయంగా భార్యవైపు చూసేడు.

"ఎందుకు?"

"నాకిక్కడ బావోలేదు."

"ఎందుకు బాలేదు? సిమ్లా...." అని చెప్పబోయేడు.

"సిమ్లా బానేవుంది. మీతో కంపె నీయే బాలేదు. నేను కొద్దికాలం పుట్టింట్లో వుందామనుకొంటున్నాను కూడా."

"నువ్వు చాలా చిన్న విషయాన్ని పెద్దది చేస్తున్నావు."


"చిన్న విషయమా? భర్తతో పరాయి స్త్రీ ఏం మాట్లాడిందో తెలుసుకోవాలను కోవటం చిన్న విషయమా? దాన్ని మీరు దాచిపెట్టి, పైగా అడుగుతే నవ్వులాటగా తీసుకొంటారా? ఏం ఆ మాత్రం హక్కు లేదా నాకు? ఇంత చిన్న విషయాన్నే నా నుంచి దాచిన వారు ఇంకా ఎంత పెద్ద పెద్ద విషయాల్ని దాస్తున్నారో? అదే నాతో ఎవరో అబ్బాయి అలా నవ్వుతూ మాట్లాడితే మీరు సహిస్తారా? చెప్పేవరకూ ప్రాణం తీయరూ? ఒకవేళ చెప్పినా అది నిజమో కాదో అని అనుమానంతో వేధించరూ - నేనేమీ అలా మిమ్మల్ని చంపటంలేదే. సరదాగా అడిగేను. దానికింత రాద్ధాంతం దేనికి. పోనీ ఆ అమ్మాయి మీతో చెప్పింది నాతో చెప్ప కూడనిదయితే చెప్పొద్దు లెండి - కానీ భార్యా భర్తల మధ్య ఇలాటి చిన్న చిన్న విషయాలే నెమ్మది నెమ్మదిగా వాళ్ళని దూరంచేస్తాయని గ్రహించండి చాలు.."

రావ్ ఆమెవైపు విదానంగా చూసేడు. ఆమె కళ్ళు వర్షించటానికి సిద్ధంగా వున్నాయి. రెండ్రోజుల్నుంచీ నిద్ర లేనట్టూ మొహం పీక్కుపోయింది. అతడికి ఒక్కసారిగా భార్యమీద అమితమైన జాలి పుట్టుకొచ్చింది. 'ఓకె' అన్నాడు.

"చెప్తాను సరేనా-"

ఆమె తలెత్తి చూసింది. అతడు కాగితం పెన్నూ తీసుకొన్నాడు. "చాలా సిల్లీగా నీకు అనిపించవచ్చు కానీ జరిగింది మాత్రం ఇది. మరి దీంట్లో ఆ అమ్మాయి అభిప్రాయం ఏమిటో నాకు తెలీదు."

ఆమె వూపిరి బిగపట్టి "ఏమిటది" అంది.



"ఉహు- నేను నోటితో చెప్పలేను-" అతనికి నవ్వొచ్చింది మళ్ళీ, ఆ అమ్మాయి అన్నది తల్చుకుంటే- "కాగితం మీద వ్రాసిస్తాను చదువుకో. కానీ ఓ షరతు. జరిగింది జరిగినట్టూ వ్రాస్తాను. దానిమీద డిస్కషను అనవసరం. 'మీరేం చేసేరు? 'మీరేం అన్లేదా!' అని ప్రశ్నలు అడక్కూడదు సరేనా?"

సుమిత్ర కూడా నవ్వింది. "సరే - మీరు మీ పంతం వదులుకొని అదిచెప్తే- ఐమీన్ - వ్రాస్తే - ఇక దాని గురించి ఏమీ అడగననీ-మీరు వ్రాయగానే మీరు దాని విషయం మర్చిపోవచ్చుననీ హామీ ఇస్తున్నాను. మనకు పుట్టబోయే పాప మీద ఒట్టు. సరేనా."

రావ్ నవ్వి బాత్‌రూమ్‌లోకి వెళ్ళేడు. షేవింగ్ మిర్రర్ కింద వత్తుపెట్టి ఆ అమ్మాయి తనతో అన్నదీ, తను విన్నదీ వివరంగా వ్రాసేడు. కాగితం అక్కడ పెట్టి రూమ్‌లోకి వచ్చేడు. సుమిత్ర అతణ్ణే చూస్తూంది. అతడు రాగానే లేచి నిలబడింది. అతడు తలూపాడు. ఆమె లోపలికి వెళ్ళబోయి అతడి దగ్గరగా ఆగింది. చటుక్కున అతడి భుజాలమీద చేతులు వేసి "రియల్లీ యూ ఆర్ ఎ నైస్ హబ్బీ-" అని సుతారంగా ముద్దు పెట్టుకొని లోపలికి వెళ్ళింది.

రావ్ ఊపిరి బిగపట్టి నిలబడ్డాడు. ఆమె లోపల్నించి బైటకొచ్చే క్షణం కోసం. ఆమె ముఖకవళికలు చూడటం కోసం.

నిముషం తర్వాత తలుపు దగ్గిర అలికిడి వినిపించింది. ఆమె వస్తూంది. అతడు టెన్షన్‌తో ఆమెవైపు చూసేడు. కానీ ఆమె మొహం నిరాశతో పాలి పోయి వుంది.

"నీకు బుద్ధిలేదు రావ్," అన్నది.

అతడు తెల్లబోయి "ఏం" అన్నాడు.

"కాగితం మీద వత్తు పెట్టొద్దా - అందులోనూ బాత్‌రూంలో."

రావ్ చప్పున వంగి పక్కకిచూసేడు. అతడు వ్రాసిన కాగితం, గాలికి ఎగిరి బాత్‌టబ్‌లో నిండుగా పట్టిన నీళ్ళమీద పడవలా తేలుతూంది.

రావ్ ఆమెవైపు నిజాయితీగా చూసేడు "నేను నిజంగా వ్రాసేను" అన్నాడు.

"చూసేను అంది. అక్షరాలున్నాయి. కానీ అలుక్కుపోయాయి."

"పోన్లే నేనే చెప్తాను. అసలేం జరి గిందంటే...." చెప్పబోయేడు.

"వొద్దు" అంది సుమిత్ర. "ఆ విషయం ఇక మాట్లాడనని పాపమీద ఒట్టుపెట్టు కొన్నాగా."